కథా నిలయం
5081
శ్రీకాకుళం

# మబ్బు

నిశ్చలమైన సరస్సులోనికి రాయి విసిరి అలలు రాకుండా, అరికట్టడం అసాధ్యం. 'యాజులు' అంటే ఎవరో ఆ ఆదివారం మిట్టమధ్యాహ్నం వరకూ నాకు తెలియదు. తరచు చూస్తున్న ముఖమే. కాని ఆ ముఖానికి – అదే అందులో చేరి ఉన్న మనిషికి అందరి మనుషుల్లాగా ఒక పేరు ఉంటుందని ఎవరికీ తెలియదు. దానికి ఎవరి తప్పూ లేదని ప్రస్తుతానికి భేషరతుగా ఒక నిర్ణయానికి రావడం ఉచితం.

అధికారంతో విర్రవీగుతున్న మూర్ఖుల అహంకారంలా సలసలా కాగిపోతోంది బయట ఎండ.

భోజనానికి కూచున్నాను.

''అమ్మా !'' పిలుపు.

''వీధి తలుపు గడియవేసి భోజనానికి రమ్మని ఎన్నిసార్లు చెప్పాను !'' బాబీసి అమ్మ గద్దించి అడుగుతోంది.

''మనింటికి వచ్చే ముష్టివాళ్లకి వేళాపాళా లేదు. గుడి తలుపుల్లా ఎప్పుడూ మన తలుపులు తీసే ఉంటాయి. చరచరా లోపలికి జొరబడిపోవడమే ప్రతివాళ్లూ...'' మా అమ్మాయి.

పీటమీద నుండి వెనక్కు వాలి సావిట్లోకి చూశాను.

వచ్చిన మనిషి ఉస్సురంటూ గచ్చుమీద చతికిలబడ్డాడు.

''అపరాహ్ణం వేళ– ముష్టి వెయ్యకూడదు !'' అమ్మ ఆజ్ఞ !

'' ఉండు నే తిని వెళ్లి ఏదైనా ఇస్తా... పాపం ఇంత ఎండలో వచ్చాడే, అమ్మా, ఇది ముష్టికాదు. ఆయవారం !''

'' ఏదైతేనేం ! ఇలాంటి వేళప్పుడు వెయ్యకూడదు. '' అమ్మ తెంచేసింది నేను ఉపక్రమించబోతున్న వాదన. ఆ వాదన ఎన్నోసార్లు జరిగిందే.

ఒక రెండు నిమిషాల తర్వాత అవధాని గారు సొంతం – నేను భోజనం చేస్తున్నానని బెరుకు కూడా లేకుండా – లోపలకు వచ్చేశారు.

''కూచోండి బాబూ ! బాబు భోజనం చేస్తున్నాడు. రవణమ్మా ! ఆ గదిలో ఫ్యాను వెయ్యి, పాపం ముసలి ప్రాణం – ఎండ మండిపోతోంది !''

నాకు అవధానులుగారంటే మహా చిరాకు. దానికి కారణాలు చాలా ఉన్నాయ్. ద్వాదశి ద్వాదశికీ వచ్చి స్వయంపాకం పుచ్చుకోటం ఆయన రివాజు. సుబ్రమణ్య షష్టిలాంటి సందర్భాలలో ముందు రోజో వెనుక రోజో రావడం, బోజనానికి రావడానికి వీలవదనీ, వీలుకాలేదనీ, చెప్పడం, స్వయంపాకం తీసుకెళ్లడం ఆయన అలవాటు. సాలగ్రామ దానాల్లాంటివన్నీ ప్రత్యేకంగా అమ్మ అతనికే ఇస్తుంది.

అవధానులుగారికి గెడ్డ వెనక పేటలో ఒక డాబా ఉంది. ఆయన మామూలు పురోహితుడే కాదు వాళ్లందరిలో మోతుబరి. రెండు చేతుల్లా అటు శుభకార్యాలూ, ఇటు చిన్న ఆబ్దికాల్లాంటి కార్యాలూ చేయిస్తాడు. కొడుకు ఏడెనిమిది వందలు తెచ్చుకుంటున్న ఉద్యోగి.

పాత్రత ఎరిగి దానం అని ఆయనకే అమ్మ అన్నీ ముట్టచెప్పటం నాకు చిరాకు.

ఇంక మరో కారణం.

ఒకసత్యన్నారాయణ వ్రతమన్నా, ఆబ్దీకమన్నా అమ్మ ఆయనే చేయించాలంటుంది కాని ఆయన్ని పిలవడంలో ఒక ఇబ్బంది ఉంది. వేళకు రాడు. తొమ్మిదిన్నరకు భోజనాలు చేసే అలవాటు మాది. నా ఉద్యోగం, పిల్లల చదువులూ, ఏది ఏమైనా ఆదివారం, పెలవు రోజులూ తప్ప టంచనుగా ఆ టైముకి భోజనాలు అయిపోవలసిందే.

ఒకసారి సత్యన్నారాయణ వ్రతం ఏకాదశినాడు చెయ్యదలచుకొన్నాం. ఆ రోజు సోమవారం. ఎనిమిదిలోగా రమ్మని ఆయన్ను బ్రతిమాలాను. తొమ్మిదైనా రాకపోతే చూసి ఒక వంక మా బాబీని, మరో వంక మా అమ్మాయిని, మడికట్టుకున్న నేను బయటకు వెళ్లలేక పంపించాను. పదినిమిషాలలో అమ్మాయి ఒకాయన్నీ, అబ్బాయి మరోకతన్నీ తీసుకొచ్చేశారు. కాని ఈలోగానే అవధాన్లుగారు సావిట్లో నుంచే విఘ్నేశ్వర పూజ ప్రారంభిస్తూ వచ్చేశారు.

ప్రసాదమూ తాంబూలాలూ తరవాత వచ్చి తీసుకుంటామని వెళ్లిపోయారు వ్రతం చేయించని పురోహితులిద్దరూ – పురోహితులందరితొలి బృహస్పతి అవధానులుగారు – ఆయన గొంతు విన్నా సొంతం లోపలి వరకూ వాళ్లిద్దరూ రాగలగడం నా అదృష్టమే.

అయన వింటూ ఉండగా ఆయనను గురించి వాదించుకోవడం ఇష్టంలేక వూరుకోవడం నాకు అలవాటే అయినా ఆ రోజు మాత్రం వూరుకోలేకపోయాను. ''అన్ని విధాలా ఉన్నవాడికే నువ్వు ఇవ్వదలచుకున్నది – తృణమైతేనేం, పణమైతేనేం – ఎందుకు ఇవ్వాలి ? ఆ సావిట్లో కూచున్న బీద బ్రాహ్మణుడికి ఇవ్వచ్చుగా !'' అమ్మని కొంచెం ఘాటుగానే అడిగాను.

''బాగుంది, పండితుడు పండితుడే.''

నేను నవ్వుకున్నాను. అయన చదువుతున్న శ్లోకాలు నిజంగా సంస్కృతం కాదు. శబ్దాల్లో, ఉచ్చారణలో అన్నీ అవకతవకలే. పాండిత్యం అంటే గ్లాసులో రాళ్లు వేసి కిలకరించినట్టు శబ్దం చెయ్యడమా,

నేను విసుక్కుంటానని అవధానులుగారికీ తెలుసు. ఆయనకు వినపడేటట్టు నా విసుగును చాలాసార్లు బహిర్గతం చేశాను. కాని వచ్చే దానిని పోగొట్టుకోవడం అతనికి ఇష్టం లేదు.

'' ఒక్కపావుగంట ముందొచ్చారు కాదు బాబూ. బాబు భోజనం కాగానే మిమ్మల్ని పంపించేస్తా, కాసేపు కూచోండి.'' అమ్మ ఆయనతో చెబుతూంది.

''భోజనం కాక పూర్వం ఇవ్వడంలో అర్థం ఉంది. కాని...''

–''అబ్బ. మీరు వూరుకోండి... ఆడవాళ్ల విషయాలు మీకెందుకు ?'' మా ఆవిడ కాంతా సమ్మితంగా చెప్పింది.

నేను భోజనం ముగించి కంచంలో చెయ్యి కడుక్కుని లేచాను.

''నమస్కారం బాబూ.''

అవధానులుగారి నమస్కారం ముభావంగా అందుకని సావిట్లోకి నడిచాను. కూచున్న ఆయవారం బ్రాహ్మడు లేచి నిలుచున్నాడు.

''కూచోండి, కూచోండి...'' చాలాసార్లు చూసిన ముఖమే అయినా ఈసారి పరిశీలనగా చూశాను.

పీక్కుపోయిన ముఖం, లోతు కళ్లు, పెరిగిపోయిన గడ్డం. కృశించిపోయిన శరీరం. మూడు పదులు నిండని వయస్సు – వెన్నెముకను వంచేటంత బరువుండగలదని నేను అతన్ని చూశాకే తెలుసుకున్నాను.

ముఖంలో ఉదాసీనత – ఒక వంక స్వతహః ఉన్న ప్రీతకళ. ఉతుకు మొహం ఎరుగని ముతక సైను చొక్కాలోపల మరోటి. పంచ మీద పంచ – నడుం చుట్టూ ఎత్తుగా తువాళ్లు. భుజం మీద మూట. తువాలు కిరుపక్కలా మూటలు కట్టి మెడ మీద వేసుకున్నాడు.

''మీ పేరు ?'' కుర్చీలో కూర్చుంటూ అడిగాను.

''సోమయాజులు''.

'' ఎక్కడ ఉంటుంటారు ?''

''వల్లకాట్లో, నాకు కొంపేమిటి ?''

కసిరి కొట్టినట్లు ఫెళఫెళ లాడుతూ గాజు బుడ్లు బద్దలు కొడుతున్నట్టు జవాబులు. కించిత్ నత్తి ఉందేమో మాట కొంచెం తొట్రుకు పోతున్నట్టు కూడా అనిపించింది.

'' ఆ బట్టలన్నీ అలా చుట్టుకున్నారేమిటి ?''

'' అఁ– అఁ–బాగుంది. కక్కగట్లు పట్టుకుపోతారు.''

''పోనీ ఒక సంచిలో పెట్టుకోవచ్చుగా.''

''రాత్రి నేనెలా చూసుకోవడం.''

''మీ వాళ్లెవరూ లేరా ?''

'' ఎవరికెవరు ; తల్లీ, తండ్రీ చచ్చారు. అన్నదమ్ములు ఎక్కడ చచ్చానా, బతికానా ఎవరూ అడగరు.''

అతని కాఠిన్యం, అతని భయం – రెండూ భయంకరంగా ఉన్నాయి. అల్లాంటి మనిషి సంచిని కూడా కాజేసే మనుషులుండడం ఆశ్చర్యకరం.

నాకు గుండెల్లో కెలికినట్లయింది.

కుర్చీలోంచి ఓరకంట వెనకగదిలో అవధానులు గారికి మా ఆవిడ పళ్లెంలో బియ్యం, పప్పు, వంకాయలు, దక్షిణా ఇవ్వడం చూస్తూనే ఉన్నాను..

''వస్తా బాబుగారూ.'' యాజులు వంక ఒక చూపు విసిరేసి మెట్లు దిగిపోయారు అవధానిగారు ఆ చూపులో 'దౌర్భాగ్యుడు' అనే దులపరింత, ఏహ్యాభావం ఉంది.

నాకు అవధానులుగారిని చూసి అసహ్యం వేసింది.

యాజులు ఆత్రంగా ఇంటిలోకి చూస్తున్నాడు. ఎవరైనా బియ్యం తెచ్చి వేస్తారేమోనని.

బాబీ చిలక్కొయ్య మీద ఉన్న నా చొక్కా జేబులోంచి ఒక పదిపైసలు తీసి తెచ్చి ఇచ్చాడు యాజులుకి.

''పిడికెడు గింజలు...'' కసిరినట్టే ఉంది అభ్యర్ధన కూడా.

''బాబీ, పాత్రలో బియ్యం తెచ్చి ఇయ్యి.''

బాబీ తెచ్చి వేశాడు. కింద రాలిన గింజలు కూడా జాగ్రత్తగా ఏరి మూటలో వేసుకున్నాడు.

''సోమయాజులుగారూ, సాయంకాలం మీరు ఏం చేస్తుంటారు ?''

''నా పిండాకూడు. ఆ బోడి ముండ దగ్గరే కూచుంటా. సగం బియ్యం అది తీసుకుని నాకు ఇంత ఉడికించి పడేస్తుంది.''

నేనేదైనా సరియైన ప్రయత్నం చెయ్యకుండా అతనిలో ఆశలు రేకెత్తించడం ఇష్టం లేకపోయింది.

ఆలోచనలో పడ్డాను.

ఇతని జీవితానికి అర్థం ఏమిటి ? ఇలా అడుక్కుంటూ, ఉన్న బట్టపాతలు పోతాయేమోనని అన్నీ కట్టేసుకుని - తిరిగిన రోజున తిని - తిరగని రోజున డొక్కలోకాళ్లు పెట్టుకునే ఈ జీవితానికి గమ్యం ఏమిటి ? ఇతడు నా అని ఎవరినీ నమ్మడు. అతనికి నా అనేవాళ్లు లేరు.

కరుణామయుడైన భగవంతుడిని తలచుకుని ఒక నిర్ణయానికి వచ్చాను - ఎండవేళ మేడ మీద గదిలో ఒక గంట పడుకోవడం పరిపాటి. కాని నాకు నిద్ర రాలేదు. మా ఆవిడని పిలిచి నా నిర్ణయం చెప్పాను.

''చిత్రంగా ఉంది మీ ఉద్దేశ్యం - అందులో చెడ్డ ఏమీ లేదు కాని, ఎందుకైనా మంచిది అత్తయ్యగారిని అడగండి - ఏమంటారో చూద్దాం !''

'' ఇందులో అనడానికేముంది - బయట అరుగు ఎప్పుడూ ఖాళీయే కదా ! రాత్రి అక్కడ పడుకుంటాడు. ఆ గుడ్డా గుడుసూ ఇంట్లో ఒక మూల జాగ్రత్త చేసుకుంటాడు.''

''అతనికి మాట ఇచ్చే ముందు మీ అమ్మగారితో చెప్పి మరీ చెయ్యండి.''

మధ్యాహ్నం అమ్మతో చెప్పాను. అమ్మ ఏం అనలేదు. అలాగని అవుననీ అనలేదు.

'' ఇన్ని పురాణాలు చదువుతావ్ ! ఇంత వేదాంతం చెబుతావ్ ! మనం అట్లాంటి మనిషికి కించిత్ సాయం చేయకపోతే మనం చేసినవన్నీ నిజంగా పుణ్యామే తెస్తుందంటావా ? అతనికి నీడ ఇద్దామని నా ఉద్దేశ్యం - నీ ఉద్దేశ్యం ?''

''వెర్రివాడివి. అతనంటే నాకూ జాలే. అమాయకుడు, దిక్కులేనివాడు. ఏ రోజంటే ఆ రోజు రాడు పాపం ! ఒక్క ఆదివారమే వస్తాడు. పిడికెడు వేసినా, పావుతో వేసినా ఆనందంతో వెళ్లిపోతాడు - కాని ఈ విషయంలో మనం అతనికి చెయ్యగలిగిందేమీ లేదు.. అతన్ని మనం చేరదీస్తే అతని క్షేమసమాచారాలన్నీ చూడవలసిన బాధ్యత మన మీద పడుతుంది. జ్వరం వచ్చి అరుగు మీద పడుకుంటే చేస్తామా, మానతామా ? నీ దాతృత్వం సరియైన పంథాలో ఉంది. నీకు కలిగినదో, తోచినదో అతనికి ఇవ్వడం నాకు ఇష్టమే కాని ఇంటి ముందు తెచ్చి పెట్టుకోవడం బావుండదు.''

'' ఏమిటమ్మా నువ్వు ఏమిటంటావ్ ?'' మా అమ్మాయిని అడిగాను.

'' ఏముంది సాయంకాలం ఒక నిముషం వీధి వరండాలో నిలుచోడానికి వీలు లేకుండా అక్కడ ఒక అనాథుడికి ఆశ్రయమిస్తానంటున్నారు. ఎవరైనా అతన్ని అరుగు మీద చూసి మనందరినీ ఏవగించుకుంటారు. పుస్తకాలలో చదివినదేననుకోండి. వాడి భిక్షాటనంతా మనం తీసుకుని ఇంత ముద్ద పడేసి కుక్కలా అక్కడ కాపలా పెట్టుకున్నామని అంటారందరూ !''

అంత భావనాశక్తి నాలో లేదు. అమ్మాయి భావుకత నాకు ఆశ్చర్యమనిపించింది.

''పోనీ ఆ సత్రం యజమానితో చెప్పి...''

''మనకున్న సాధక బాధకాలే సుమారు అక్కడా ఉంటాయి.'' అమ్మ ప్రారంభించింది. ''సత్రంలో వెళ్లేవాళ్లూ, వచ్చే వాళ్లూ, పెళ్లిళ్లూ, కథలూ, కార్యాలూ, అరుగు మీద ఈ శని గ్రహాన్ని చూస్తే వచ్చే వాళ్లు రారు. సత్రం బైరాగి మఠం కాదుగా !''

నాకు మాత్రం ఈ ఆలోచనలన్నీ విపరీతంగా కనిపించాయి. '' ఎవరో ఏదో అనుకుంటారని మన మనసుకి మంచిదని తోచినది చెయ్యడం ఎందుకు మానాలి ?'' - వాదనలోకి దిగాను.

''మన తిండి మనం తింటూ, మన బట్ట మనం కట్టుకుని, లోకానికి వెరవాలన్నది సామెత'' దీనితో నా నిశ్చయం మరీ ధృఢమైపోయింది.

సాయంకాలం ఆలయానికి వెళ్లాను. అక్కడున్న పూజారిని నాకు చిన్నతనం నుంచీ తెలుసు. మనిషి బహు సరళ స్వభావుడు. దైవ చింతనా, భక్తీ కలిగినవాడు. వెళ్లి వచ్చిన పని వివరించాను. విషయమైతే ఓపికగా విన్నాడు కాని, చెప్పవలసింది తెగేసి చెప్పేశాడు.

''అల్లాంటివాళ్లని ఇక్కడ ఉంచడం అసమంజసం, అసందర్భం, ప్రాంగణమంతా గలీజు, అల్లాంటి వాళ్లు వేలు చూపెడితే మండ మింగుతారు. నేనూ పిల్లా పీచుతో ఈ గుడిని నమ్ముకుని ఉన్నవాడిని – బాబూ, అభిషేకాల రోజుల్లో వస్తే అతనికి ఇన్ని కొబ్బరి చిప్పలు ఇచ్చి పంపిస్తా అంతకంటే నేను ఏమీ చెయ్యలేను. సామాన్యుణ్ణి, మీకు తెలియందేముంది. క్షమించండి .''

నాకు బాధనిపించింది. దానితోపాటు పట్టుదల ఇంకా కొంచెం పెరిగింది.

ఆలయం నుంచి నేరుగా క్లబ్బుకెళ్లాను. ఛెయిర్మన్‌గారు బ్రిడ్జి ఆడుతున్నారు. నాకు ఎంతో బలం వచ్చినట్టుయింది. ఆ బీద బాపనయ్య పట్ల దేవుడున్నాడు. ఛెయిర్మన్‌గారి దర్శనం ఇంత సులువుగా, అంత తొందరగా అవడమే అందుకు నిదర్శనం.

'' ఏమిటండోయ్, ఇలా వచ్చారు ?'' ఆయనే పలకరించాడు.

''చిన్న విషయం.''

''పదండి.'' నన్ను టెన్నిస్ కోర్టు వంక తీసుకెళ్లాడు. సావకాశంగా విన్నాడు నేను చెప్పినదంతా.

'' ఒక పని చెయ్యండి ! పార్కు మాలితో నేమాటాడతా ! రేపు సాయంకాలం అతన్ని పార్కుకి రమ్మనండి. మాలి ఏదో ఏర్పాటు చేస్తాడు... దీనికి మీరు రావాలా ? చీటీ ముక్క రాసి పంపిస్తే తీరి పోయేదిగా !''

చేటంత ముఖం చేసుకుని ఇంటికి వచ్చాను. సంతోషంగా ఇంట్లో చెప్పాలని నేను చేసిన – కాదు భగవంతుడు ఛెయిర్మన్ గారి ద్వారా యాజులుకి చేసిన ఏర్పాటు గురించి.

''పార్కులో పడుకోడానికి ఛైర్మన్‌గారి అనుమతి ఎందుకు ? ఇంతకూ పార్కులో పడుకోమని సోమయాజులు గారికి మనం చెప్పాలా !''

మా ఆవిడ తుంచేసింది.

ఆ మాటల్లో నిజం ఆకళింపు చేసుకుని జావకారిపోయేను నేను.

''అయితే అతనికి, మనం ఏం చెయ్యలేమా ?''

'' ఎందుకు చెయ్యలేం ? వచ్చినప్పుడు ఏదో మనకు తోచినది ....''

''అది కాదు. అతను మనిషిలా బ్రతకాలని, దానికి మనం దోహదం చెయ్యాలని నా బాధ. పిల్లలంతా పిచ్చివాడి వెంట పడ్డట్టు యాజులు వెంట చేరి గేలి చేస్తున్నారు. రాళ్లు రువ్వుతున్నారు. అమాయకుడు – వాళ్లకి అతని మీద శత్రుత్వం లేదని కాని, వాళ్లు గేలి చేస్తున్నది అతని అవతారాన్నని గాని అతనిని కాదని అవగాహన లేక నోరు పారేసుకుంటున్నాడు. వాళ్లు రెచ్చిపోతున్నారు.....''

నా గొంతులో మనసులోంచి ప్రతిధ్వనిస్తూంది. మా ఆవిడ కరిగింది.

''అత్తయ్యగారూ ! పోనీ మనమే అతనికి ఆశ్రయమిస్తే !''

''పోన్లేవే ! దీనికోసం మనసు ఇంత కష్టపెట్టుకుంటున్నాడు వాడు. మీ ఇద్దరికీ ఇష్టమైతే నాకేం?

అలాగే ఆ వీధి కొట్టులో ఎలానూ పనికి రాని డొక్కులూ, డోళ్లూ, చెత్తా, చెదారం వేసేశాం. అవి కాస్త తీయించి బాగు చేయిస్తే అతగాడు అక్కడ తన సామాన్లు పడేసుకుంటాడు. కొంచెం గాలి వెలుగూ బాగా రావనుకో. అయినా ఫర్వాలేదు. వేసవికాలం అరుగుమీదా, సీతాకాలం కొట్లోనూ పడుకోవచ్చు. దగ్గరే చెరువు – అక్కడే స్నానం, పానం చూసుకుంటాడు.''

సైకిలు వేసుకొని యాజులు కోసం బయలుదేరాను. వైశ్యవీధిలో వాకబు చేశాను. పేరు చెబితే తెలియలేదు కాని అతని వర్ణన కొంత కొనసాగించేసరికి ఒకాయన బోధపరచుకున్నాడు.

''మంచివాడే సుమండీ ! ఏదో వీధి అరుగు మీద కాపలా ఉంటాడని ఎక్కడ పడుకున్నా పడుకోనిస్తున్నాం ! ఇంత కంగారుగా వెతుక్కుంటూ వచ్చారు, వస్తువేమైనా పోయిందా ?''

''ఛ, ఛ ! అదేం కాదు ! అతనికి కొంత సహాయం చేద్దామని....''

''అలాగా. ఏ రాత్రో వచ్చి ఇక్కడ పడుకుంటాడు. ఇక్కడంటే ఇక్కడే అని కాదు. ఈ వీధిలో ఏదో ఒక ఇంటి అరుగు మీద... ఒక పని చెయ్యండి. స్టేషన్ కెదురుగా ఉన్న గుడిసెల్లో ఒక బోడెమ్మగారుంది. ఆవిడే ఇతగాడి కింత వండిపెడతుంది. అ ర్జంటయితే అక్కడకి వెళ్లి భోగట్టా చెయ్యండి.''

స్టేషనుకయితే వెళ్లాను కాని యాజులు కాని, ఆ 'బోడెమ్మ' కాని ఉండే గుడిసె పోల్చుకోవడం సాధ్యం కాలేదు.''

ఆదివారం అతను వచ్చే వేళకు అరుగు మీదే నుంచున్నాను. చేతిలో ఒకరువ్వా, రెండు భుజాల మీదా మెడ మీదుగా రెండు మూటలు. చంకలోంచి పురికొసంతో వేలాడుతున్నదుప్పటీ చుట్ట – ఎత్తుగా పొట్ట – నడుం చుట్టూ బట్టలో కట్టుకుని పొలం మధ్య దిష్టిబొమ్మలా వికృతంగా నడిచి వస్తున్న యాజులును చూసి వీధిలోని పిల్లలు చుట్టూ చేరి ''లూ, లూ. లు, లూ,'' అని అరవడం, అతను బెత్తం విదిలించి కలియబడడం దొంగకక్కగట్లారా అని వాళ్లని తిట్టడం వీధి మలుపు దగ్గర నుంచీ చూస్తూనే ఉన్నాను.

యాజులు ఇళ్లన్నీ చూసుకుని ఎట్టకేలకు మా ఇంట్లో దూరాడు.

''రండి, రండి'' అని ఆహ్వానించాను. ''దాహం తీసుకుంటారా ?''

మా ఆవిడ నిమ్మకాయ రసం, ఉప్పు కలిపిన మజ్జిగ తెచ్చి ఇచ్చింది అతనికి.

మేడ మీదకు వెళుతూ అమ్మ మెట్ల మీద నుండి మా సంభాషణ కోసం ఎదురు చూస్తున్నట్టనిపించింది.

''మిమ్మల్ని చూస్తే జాలి వేస్తుంది సోమయాజులుగారూ, ఇలా అరుగుల మీద ఎన్నాళ్లు పడుకుంటారు ? మా వీధి కొట్టు మేము వాడడం లేదు. అద్దెకివ్వడానికి పనికి వచ్చేదీ కాదు అది. మీరు అందులో ఉండవచ్చు. మీ సామాను భద్రంగా ఉంటుంది. ఇలా అన్నీ శరీరం మీద వేసుకుని మోసుకుంటూ తిరగనక్కరలేదు... ఆ పిల్లలు అప్పుడు మిమ్మల్ని చూసి హేళన చెయ్యరు. వేసవిలో అరుగు మీద...''

''అరుగు మీదా, నేనా. గదిలో బట్టలా, అయినా నా బట్టల గోల మీకెందుకూ. మంచి వాళ్లనుకుని వచ్చా. చస్తే మరి రాను.''

లోపల నుంచి మా ఆవిడ పళ్ళెంలో బియ్యం అవీ తెచ్చేలోపల సోమయాజులు గరిమనాభి ఆధారపీఠాన్ని తప్పి ప్రమాదమున్న గడ్డి బండిలా వూగుతూ, జోగుతూ వెనకనుంచి దొంగలు గెంటుకొస్తున్నట్టు అప్పటికే వీధి మలుపు తిరిగిపోయాడు.

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

1989